www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి
TELANGANA RISING CURE - PURE - RARE



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:48 SUNDAY ,JUNE 28,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 48 ఆదివారం 28 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

# 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ

సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధ తాబేలుతో ప్రధాని మోదీ భేటీ

194 ఏళ్ల 'జొనాథన్' నివసిస్తున్న బొటానికల్ గార్డెన్స్‌కు సందర్శన

పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కను నాటిన ప్రధాని





# చినుకుల సాక్షిగా.. ప్రగతి అడుగులు..

వర్షపు జల్లుల మధ్యే కూసుమంచి మండలంలో రూ. 16.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి

వానాకాలం రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారంగా వంతెనలు.. బీటీ రోడ్లు

హంసకలం వార్త జూన్ 27 : ఆకాశం నుంచి వర్షపు చినుకులు నేలను తాకుతున్నా.. వాతావరణం అనుకూలించకపోయినా లెక్కచేయకుండా, గ్రామీణ రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రగతి బాట సాగింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా... వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా మిగతా2లో



## గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలి

హంసకలం వార్త : గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మిగతా2లో

### అయోధ్య విరాళాల వివాదం..

## మోదీ మౌనాన్ని ప్రశ్నించిన ప్రియాంక్ ఖర్గే




-అయోధ్య విరాళాల వివాదంపై 'మన్ కీ బాత్'లో మోదీ మాట్లాడాలన్న ప్రియాంక్ ఖర్గే

-భక్తుల మనోభావాలతో బీజేపీ ఆడుకుంటోందని విమర్శలు

-సిట్ దర్యాప్తులో 8 మంది అరెస్ట్, రూ. 80 లక్షల నగదు స్వాధీనం

హంసకలం వార్త అయోధ్య రామమందిరానికి అందిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహిస్తున్నారంటూ కర్ణాటక హోం మంత్రి, కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే తప్పుబట్టారు. ఈ అంశంపై ప్రధాని తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో స్పష్టత ఇవ్వాలని

# రూ. 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం



భూమిపూజ నిర్వహించిన ఎమ్మెల్యే వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్

ఆలయ రూపురేఖలు మార్చేలా తొలి విడత అభివృద్ధి పనులు

వచ్చే ఏడాది శ్రీరామ నవమి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం

హంసకలం వార్త: ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన భద్రాద్రి ఆలయ మాస్టర్ ప్లాన్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. భద్రాద్రి క్షేత్ర అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్ మిగతా2లో



## హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగులు ముందుకు సాగాలి

దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ-ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది.

హంసకలం వార్త: ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ-ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె మిగతా2లో

## హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా అజిత్ రెడ్డి

-ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొనసాగుతున్న అజిత్ రెడ్డికి అదనపు బాధ్యతలు

-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ

-మెట్రో ఫేజ్-2 విస్తరణ ప్రయత్నాల మధ్య ఈ నియామకం ప్రాధాన్యం

హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ అధికారి బి. అజిత్ రెడ్డి నియమితులయ్యారు. ఆయనకు ఈ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

2



## ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి

- చంద్రబాబు, రేవంత్, డీకే శివకుమార్ భేటీపై హరీష్ స్పందన
- తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చారిత్రక ఒప్పందం అని రేవంత్ అంటున్నారని విమర్శ
- శిష్యుడు సీఎం అయ్యాడని చంద్రబాబు గుండ్రేవులను తీసుకొస్తున్నారని ఆరోపణ

వివరాలు2లో

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు




గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి

-ఈ జులై 31 లోపు ఏడు ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడి

-డ్రైవర్లను భాగస్వాములుగా చేసే సహకార నమూనాతో ఈ ప్లాట్‌ఫామ్ పనిచేస్తుందన్న అమిత్ షా

-'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే ప్రధాని మంత్రాన్ని సాకారం చేస్తున్నట్లు వ్యాఖ్య

హంసకలం వార్త: రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు మిగతా2లో

## ఆ రెండు చట్టాల గురించి ఒవైసీ చదవాలి

పాస్‌పోర్ట్, పౌరసత్వంపై ఒవైసీ వ్యాఖ్యలను ఖండించిన కిషన్ రెడ్డి

ఓటరు జాబితా సవరణ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం

ప్రజల్లో అనవసర ఆందోళన సృష్టించవద్దని ఒవైసీకి హితవు

బారిస్టర్ అయిన ఒవైసీ చట్టాలను సరిగా చదవాలన్న కేంద్ర మంత్రి



హంసకలం వార్త: పాస్‌పోర్ట్‌ను పౌరసత్వంతో ముడిపెడుతూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఒవైసీ వ్యాఖ్యలు చట్టవిరుద్ధమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణలో మిగతా2లో



# చినుకుల సాక్షిగా.. ప్రగతి అడుగులు..

వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. వానలు పడుతున్నా ప్రజల కోసం ప్రగతి పనులు ఆపబోమని, అధికారులు కూడా అంతే వేగంతో నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

**రూ. 16.13 కోట్లతో శంకుస్థాపనలు..**

మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు గైగోళ్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జడ్పీ రోడ్డు నుండి కొత్తూరు – ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్ సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్ళే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నియోజక, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగులు ముందుకు సాగాలి

దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు. దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ–ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ...

భారత్–సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన 'జోనాథన్' అనే తాబేలుతో ఆయన భేటీ అయ్యారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు. సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు. భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## అయోధ్య విరాళాల వివాదం.. మోదీ మౌనాన్ని ప్రశ్నించిన ప్రియాంక్ ఖర్గే

అయోధ్య రామమందిరానికి అందిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహిస్తున్నారంటూ కర్ణాటక హోం మంత్రి, కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే తప్పుబట్టారు. ఈ అంశంపై ప్రధాని తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో స్పష్టత ఇవ్వాలని శనివారం ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురి అరెస్టులు జరగడం, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక సభ్యులు రాజీనామా చేయడంతో ఈ వివాదం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. విరాళాల సేకరణలో కోట్లాది రూపాయల అవకతవకలు జరిగాయని ఈ నెల ప్రారంభంలో సమాజ్‌వాదీ పార్టీ నేతలు ఆరోపించడంతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. సిట్ సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అధికారులు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మాజీ సహాయకుడు రామశంకర్ యాదవ్‌తో సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా అధికారులు సుమారు రూ. 80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, నిష్పక్షపాత విచారణకు సహకరించేలా నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా గురువారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ, సిట్ దర్యాప్తులో నిజానిజాలు బయటపడతాయని, దోషులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అయితే, 'రామభక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు' అన్న యోగి వ్యాఖ్యలపై ప్రియాంక్ ఖర్గే ఘాటుగా స్పందిస్తూ, "భక్తుల మనోభావాలతో ఆడుకుంది ఎవరు? ఈ కేసులో పట్టుబడింది మీ వాళ్లేకదా" అని బీజేపీపై విమర్శలు గుప్పించారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

నేడు గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు. గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ–వీలర్లు, ఆటో–రిక్షాలు, ఫోర్–వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్–సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# తెలంగాణకు చల్లని కబురు.. వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు

రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే, తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రానున్న ఏడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం.. నేడు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. వీటితో పాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్ష సూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. జులై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొంది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది. ఇక, రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది.

## గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలి

**అధికారులు సమన్వయం చేసుకోవాలి..**

జిల్లా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణేశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ప్లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

## రూ. 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం

ఆలయ పరిసరాల్లో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఈ మెగా ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. భద్రాచలం రామాలయ రూపురేఖలను మార్చేలా మొత్తం రూ. 200.89 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ తొలి విడత అభివృద్ధి పనులను చేపట్టారు. ఆలయానికి తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపు ఉన్న పాత నిర్మాణాల తొలగింపు పనులు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఆలయ పరిసరాల క్లియరెన్స్ పూర్తయిన తర్వాత... ప్రభుత్వం సిద్ధం చేసిన కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పూర్తి శాస్త్రోక్తంగా, ఆగమ శాస్త్ర నియమాలను పాటిస్తూ అభివృద్ధి పనులు చేపడతారు. వచ్చే సంవత్సరం శ్రీరామ నవమి పండుగ నాటికి ఈ ఆలయ నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి

కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు (చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్) జరిపిన రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో సీఎంలు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురు మాత్రమే కూర్చుని ఏం చర్చించారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులు ముందుకు వెళుతుంటే, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'చారిత్రక ఒప్పందం' అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులను బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని... కానీ ఇప్పుడు ఏపీ సీఎం తన 'శిష్యుడు' రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును తీసుకురావడం జరుగుతోందని ఆరోపించారు. ఆర్డీఎస్‌కు స్పష్టమైన నీటి కేటాయింపులు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించిన హరీష్ రావు... రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ సగటున 4 టీఎంసీలు మాత్రమే తెచ్చుకుంటే, బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున అనుమతులు తెచ్చుకున్నామని గుర్తు చేశారు."మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నాం. ఇంకా 138 టీఎంసీలు రావాలి. రేవంత్ రెడ్డి తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావద్దు" అని వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా అజిత్ రెడ్డి

ప్రస్తుతం అజిత్ రెడ్డి పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని 'ఇన్వెస్ట్ తెలంగాణ' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్ (ఐడీఈఎస్) అధికారి అయిన అజిత్ రెడ్డికి, రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఈ కొత్త బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ నగరంలో పట్టణ రవాణా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే క్రమంలో ఈ నియామకం అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. ప్రస్తుతం సర్ఫరాజ్ అహ్మద్ హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమై మెట్రో రైలు విస్తరణపై చర్చించారు. మెట్రో ఫేజ్–1 వాల్యుయేషన్, ఫేజ్–2 విస్తరణ ప్రణాళికల కోసం ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ (ఎస్‌బీఐక్యాప్స్)ను కన్సల్టెంట్‌గా నియమించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

## ఆ రెండు చట్టాల గురించి ఒవైసీ చదవాలి

తెలంగాణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో వీరిద్దరి మధ్య చెలరేగిన మాటల యుద్ధం రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. తెలంగాణలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై స్పందిస్తూ.. తుది జాబితాలో పేర్లు లేని పక్షంలో సదరు వ్యక్తుల పౌరసత్వంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సందేహాలు తలెత్తే అవకాశం ఉందని, పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ ఇబ్బందులు ఎదురవుతాయని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. "పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి తిరుగులేని ఆధారమని విదేశాంగ శాఖ స్పష్టం చేయనప్పటికీ, అది భారత పౌరులకు మాత్రమే అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం జారీ చేసే అత్యంత కీలకమైన పత్రం" అని ఆయన పేర్కొన్నారు. బారిస్టర్ కోర్సు చదివిన ఒవైసీ, పౌరసత్వ చట్టం–1955, పాస్‌పోర్ట్ చట్టం–1967లను మరోసారి అధ్యయనం చేసి మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అనవసర ఆందోళనలను సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ఈ తాజా వివాదం తెలంగాణ రాజకీయాల్లో పత్రాల పరిశీలన, ఓటరు జాబితా సవరణ, పౌరసత్వం వంటి సున్నితమైన అంశాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
ఆదివారం 28 జూన్ 2026


# సంపాదకీయం


## ఎరువుల సంక్షోభానికి విరుగుడు ఇదీ..!

భారతదేశం లాంటి వ్యవసాయం మీద ఎక్కువగా ఆధారపడే ఆర్థిక వ్యవస్థలో ఎరువుల లభ్యత, వాటి ధరలు కేవలం మార్కెట్ అంశాలు మాత్రమే కావు; అవి దేశ సార్వభౌమాధికారాన్ని, ఆహార భద్రతను, కోట్ల మంది రైతుల జీవనోపాధిని శాసించే కీలక శక్తులు. ప్రతి ఏటా సాగుకాలం ప్రారంభం కాగానే దేశంలోని ఏదో ఒక మూల నుంచి ఎరువుల కొరత వార్తలు రావడం, సబ్సిడీల భారంపై పార్లమెంట్‌లో చర్చలు జరగడం మనకు అలవాటుగా మారిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతదేశం కేవలం రసాయన ఎరువుల దిగుమతి కోసమే దాదాపు ఒక లక్షా ఇరవై ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా భారీ మొత్తాన్ని విదేశీ మారకద్రవ్యం రూపంలో వెచ్చించాల్సి రావడం మన ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ఒత్తిడికి స్పష్టమైన నిదర్శనం. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, చైనా ఎగుమతులపై ఆంక్షలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడిసరుకుల ధరల హెచ్చుతగ్గుల వల్ల మన దేశీయ ఎరువుల సరఫరా క్రమం నిరంతరం ఒడుదుడుకులను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో, ప్రతి పంటకూ విదేశీ దిగుమతులపై ఆధారపడాల్సిన ఈ బలహీనత నుంచి దేశాన్ని శాశ్వతంగా గట్టెక్కించడానికి సంప్రదాయ మార్గాలను దాటి సరికొత్త, విప్లవాత్మక ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మనం ఒకవైపు వేల కోట్లు ఖర్చు చేసి నైట్రోజన్, ఫాస్పరస్ వంటి ఎరువులను దిగుమతి చేసుకుంటూ, మరోవైపు అవే పోషకాలు అత్యంత సమృద్ధిగా ఉన్న మిలియన్ల లీటర్ల మురుగునీటిని రోజూ వృథాగా నదుల్లోకి, సముద్రాల్లోకి వదిలేస్తూ పర్యావరణాన్ని పాడుచేసుకుంటున్నాము. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదికల ప్రకారం, దేశంలో రోజూ ఉత్పత్తి అవుతున్న సుమారు ఏడు వేల మూడు వందల కోట్ల లీటర్ల మురుగునీటిలో సగానికి పైగా ఎటువంటి శుద్ధి ప్రక్రియ లేకుండానే నేరుగా ప్రకృతిలో కలుస్తోంది. ఈ మురుగునీటి బురదను గనుక శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి, అందులోని నైట్రోజన్, ఫాస్పరస్‌లను తిరిగి సేకరించగలిగితే, అది రసాయన ఎరువుల కంటే ఇరవై నుంచి ముప్పై శాతం తక్కువ ఖర్చుతోనే దేశీయ ఎరువుల అవసరాలను తీర్చగలదు. ప్రపంచ దేశాలు తమ మురుగు వ్యర్థాల పునరుద్ధరణపై దృష్టి పెడితే, గ్లోబల్ ఫాస్పరస్ డిమాండ్‌లో ముప్పై శాతం, నైట్రోజన్ డిమాండ్‌లో ఇరవై శాతం వరకు కేవలం మానవ వ్యర్థాల నుంచే సాధించవచ్చు. ఐరోపా దేశాలైన నెదర్లాండ్స్, డెన్మార్క్ వంటివి ఇప్పటికే ఈ విధానంలో అద్భుత విజయాలు సాధించాయి. అవి తమ నగరాల్లో ఉత్పత్తి అయ్యే మురుగునీటి బురదను సగానికి పైగా వ్యవసాయ రంగానికి సురక్షితమైన సేంద్రీయ ఎరువుగా మారుస్తూ పర్యావరణాన్ని, ఆర్థిక వ్యవస్థను రక్షించుకుంటున్నాయి. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసే జర్మనీ సైతం ఒక అడుగు ముందుకు వేసి, రాబోయే మూడేళ్లలో దేశంలోని అన్ని పెద్ద మురుగునీటి ప్లాంట్ల నుంచి ఫాస్పరస్ సేకరించడాన్ని చట్టబద్ధంగా తప్పనిసరి చేసింది. ఆసియా ఖండంలో గమనిస్తే, గత శతాబ్దపు అరవైల నాటికి భారతదేశం కంటే దారుణమైన ఆర్థిక పరిస్థితులు ఉన్న దక్షిణ కొరియా, కేవలం ఒకే ఒక్క దశాబ్దంలో తన ప్రణాళికల ద్వారా తాగునీటి, మురుగునీటి మౌలిక సదుపాయాలను ఆధునీకీకరించి, నేడు తొంభై ఐదు శాతం పైగా పారిశుధ్య పరిధిని సాధించింది. కానీ భారతదేశం మాత్రం గత పదేళ్లలో దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో మరుగుదొడ్లను నిర్మించినప్పటికీ, అది కేవలం నిర్మాణాలకే పరిమితమైంది తప్ప, ఆ వ్యర్థాలను సమర్థవంతంగా శుద్ధి చేసే అదనపు మురుగునీటి శుద్ధి ప్లాంట్లపై ఆశించిన స్థాయిలో పెట్టుబడులు పెట్టలేకపోయింది. ఈ వ్యవస్థాగత లోపానికి ప్రధాన కారణం బ్రిటిష్ కాలం నాటి, అంతకంటే ముందున్న చారిత్రక, కుల ఆధారిత పారిశుధ్య పద్ధతులే. పంతొమ్మిదో శతాబ్దంలోనే టోక్యో వంటి అంతర్జాతీయ నగరాలు ఆధునిక భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలను నిర్మించుకుంటుంటే, అప్పటి బ్రిటిష్ పాలకులు భారతదేశంలో ఈ టెక్నాలజీపై పెట్టుబడి పెట్టడానికి నిరాకరించారు. దానికి కారణం వారికి ఉచితంగా లేదా తక్కువ కూలితో లభించే వంశపారంపర్య శ్రామికులు అందుబాటులో ఉండటమే. ఈ క్రూరమైన శ్రమ విభజన వల్లే భారతదేశంలో పారిశుధ్యం అనేది సాంకేతిక సమస్యగా గాక, ఒక నిర్దిష్ట వర్గానికి పరిమితమైన సామాజిక సమస్యగా మిగిలిపోయింది. ఫలితంగా నేటికీ వేలాది మంది పారిశుధ్య కార్మికులు రక్షణ కవచాలు లేకుండా సెప్టిక్ ట్యాంకులు, మురుగు కాలువలలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. చట్టాలు ఎన్ని మారినా, ఈ దురాచారం కొనసాగడానికి కారణం పారిశుధ్య రంగంలో యాంత్రీకరణ లోపించడమే. వ్యవసాయాన్ని సంక్షోభం నుంచి రక్షించాలన్నా, ఎరువుల సబ్సిడీల భారాన్ని తగ్గించాలన్నా, రైతాంగానికి సకాలంలో ఎరువులు అందించాలన్నా పునరుత్పత్తి (రీసైక్లింగ్) మినహా మరో మార్గం లేదు. భారతదేశం తన పారిశుధ్య రంగాన్ని కేవలం ‘శుభ్రత’ కోణంలోనే గాక ‘ఆర్థిక, వ్యవసాయ పునరుద్ధరణ’ కోణంలో చూడాలి. జాతీయ పారిశుధ్య విధానాన్ని, జాతీయ ఎరువుల పాలసీతో అనుసంధానించాలి. నగరాల నుంచి వచ్చే మురుగునీటిని శాస్త్రీయంగా శుద్ధి చేసి, మానవ ప్రమేయం లేకుండా వంద శాతం యాంత్రీకరణ ద్వారా ఎరువులుగా మార్చినప్పుడే రెండు ప్రధాన జాతీయ లక్ష్యాలు నెరవేరుతాయి. అటు శతాబ్దాలుగా మురుగు గుంతల్లో మగ్గుతున్న శ్రామికులకు వివక్ష, ప్రాణాంతక శ్రమ నుంచి విముక్తి లభిస్తుంది. ఇటు దేశానికి వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆదా అయ్యి వ్యవసాయ రంగంలో నిజమైన స్వయం సమృద్ధి సిద్ధిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా ఈ ‘వ్యర్థాల నుంచి ఎరువుల’ భారీ ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టడమే నేటి దేశ ప్రగతికి ఏకైక రాజమార్గం.

# దలైలామా కోసం 140 కిలోమీటర్లు గుర్రాలపై!





స్వాతంత్ర్య ప్రదాతలు, గణతంత్ర రాజ్య వ్యవస్థాపకులు అయిన మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ, డాక్టర్ అంబేద్కర్, సర్దార్ పటేల్ మొదలైన మహోన్నతుల జనన, మరణ తేదీలను మనం మరచిపోము. ఆ సందర్భాలలో ఆ మహనీయులను సంస్మరించుకుని స్ఫూర్తి పొందుతున్నాం, నివాళులర్పించి కర్తవ్యోన్ముఖులమవుతున్నాం. ఆ మహానుభావుల వలే ప్రసిద్ధులు కాని, అయితే జాతి నిర్మాణానికి ప్రశస్త సేవలు అందించిన సముదాత్తులకు సంబంధించిన ముఖ్యమైన వార్షికోత్సవాలను విస్మరిస్తున్నాం. భారత రిపబ్లిక్ సంస్థాపక భావాలను తన విధ్యుక్త ధర్మ నిర్వహణలో సంపూర్ణంగా ప్రతిబింబింపజేసిన ఒక పాలనాదక్షుడి శత జయంతి సందర్భంగా ఆయనకు నివాళు లర్పించేందుకు ఈ కాలమ్‌ను ఉద్దేశించాను. ఆ అనుపమేయ దేశభక్తుడు హర్‌మందర్ సింగ్. నేడు (జూన్ 27) ఆయన శతజయంతి. జాతి నిర్మాణంలో ఒక సాహస ప్రయోగమైన ‘ఇండియన్ ఫ్రాంటియర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్’ (ఐఎఫ్ఏఎస్)కు చెందిన ప్రముఖ అధికారి. ఒక ప్రత్యేక లక్ష్యం కోసం ఏర్పడి విశిష్ట సేవలు అందించిన సర్వీస్ అది. ప్రస్తుతం ఉనికిలో లేని ఆ సర్వీస్ గురించి ఈ తరం వారికి దాదాపుగా ఏమీ తెలియదనే చెప్పవచ్చు. అయితే ఐఎఫ్ఏఎస్ గురించి ప్రజలకు మరింత మెరుగైన అవగాహన కల్పించాల్సిన అవసరమున్నది. ఇండియన్ ఫ్రాంటియర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ గురించి నేను మొట్టమొదట 1990ల తొలినాళ్లలో విన్నాను. మానవశాస్త్రవేత్త వెరియర్ ఎల్విన్ (1902--1964) జీవిత చరిత్ర రచనా కృషిలో నేను తలమునకలై ఉన్న రోజులవి. ఎల్విన్ బ్రిటిష్ జాతీయుడు. మధ్య భారతదేశంలోని ఆదివాసీల మధ్య రెండున్నర దశాబ్దాల పాటు నివసించాడు. ఆ ఆదివాసీల చరిత్ర, సంస్కృతి గురించి విస్తృతంగా రాశాడు. అంతకంటే ముఖ్యంగా వారి సమస్యలపై సమగ్ర అవగాహన ఉన్న మానవశాస్త్ర విజ్ఞాని. స్వాతంత్ర్యానంతరం ఆయన భారత పౌరసత్వాన్ని స్వీకరించారు. 1954లో నార్త్ ఈస్ట్రన్ ఫ్రాంటియర్ ఏజెన్సీ (నీఫా) ఆదివాసీ వ్యవహారాలపై సలహాదారుగా నియమితులయ్యారు (ప్రస్తుత అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రమే నాటి నీఫా). ఐఎఫ్ఏఎస్ అధికారులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో మిష్మి ఆదివాసీ విద్యావంతుడు ఒకరు తనకు చెప్పిన మాటలను ఎల్విన్ సదా మనసులో ఉంచుకున్నారు. ఆ మిష్మి గిరిజనుడు ఎల్విన్‌ను ఇలా సూటిగా, స్పష్టంగా హెచ్చరించారు: ‘గుర్తుంచుకోండి, సంస్కృతిపరంగా చూసినా, జాతిపరంగా చూసినా మేము భారతీయులం కాబోము. మా సంస్కృతిని, మతాన్ని తక్కువ చూపు చూసే, అసలు మమ్ములను తోటి మనుషులుగా గుర్తించని అధికారులను మా వ్యవహారాల నిర్వహణకు పంపితే కొద్ది సంవత్సరాలలోనే మేము మీకు నిశ్చితంగా వ్యతిరేకులమవుతాము’. ఐఎఫ్ఏఎస్ అధికారులు తమ విధులను నిర్వహిస్తున్న తీరుతెన్నులను ప్రధాని నెహ్రూ విశేష శ్రద్ధాసక్తులతో పర్యవేక్షిస్తుండేవారు. నెహ్రూ వారికి చెప్పిన మాటలను ఒక అధికారి ఇలా గుర్తుచేసుకున్నారు: ‘సిబ్బంది జాతీయ పతాక వెంట వెళ్లాలి. టైప్ రైటర్లు ఆ తరువాత వస్తాయి’. నిగూఢంగా ఉన్న ఈ గంభీరమైన మాటల అర్థం ఇది: ‘ప్రజలే ప్రథమం. అధికారిక ప్రభుత్వ వ్యవస్థలను ప్రవేశపెట్టే ముందు పాలనా సిబ్బంది ప్రజల గౌరవాన్ని, స్నేహాన్ని సంపాదించుకోవాలి. స్థానికులతో సత్సంబంధాలను ఏర్పరచుకున్న తరువాతే అధికారిక ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి క్రమబద్ధమైన పాలననందించాలి’. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ అధికారుల వలే కాకుండా ఐఎఫ్ఏఎస్ అధికారులు లోతట్టు ప్రాంతాలకు సైతం వెళ్లేవారు. సాయుధ అంగరక్షకులు లేకుండా, తరచూ భార్యలతో కలిసి వెళ్లేవారు. ఈ వ్యవహారశైలి, స్థానికులతో సౌహార్దత, సాన్నిహిత్యం పెంపొందించుకునేందుకు విశేషంగా తోడ్పడింది. ఎల్విన్ జీవితచరిత్ర రచనకై నా పరిశోధనా వ్యాసంగాలలో భాగంగా విశ్రాంత జీవనంలో ఉన్న ఐఎఫ్ఏఎస్ అధికారులు కొంత మందిని ఇంటర్వ్యూ చేశాను. తొలుత హర్‌మందర్ సింగ్, ఆ తరువాత రషీద్ యూసఫ్ అలీ, ఆర్ఎన్ఎన్ హల్దిపర్, టీఎస్ మూర్తి, ఎన్‌డీ జయాల్‌తో వివిధ విషయాల గురించి మాట్లాడాను. ప్రతి ఒక్కరూ నీఫాలో తమ ఉద్యోగ కాలపు అనుభవాల గురించి ఉత్సాహంగా మాట్లాడారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లి బయటి ప్రపంచం అంతగా తెలియని ఆదివాసులతో సంబంధాలు నెలకొల్పుకుని వారి విశ్వాసాన్ని ఎలా చూరగొన్నదీ సంవేదనశీలతతో వివరించారు. పథ నిర్దేశక పాలన నందించిన ఐఎఫ్ఏఎస్ అధికారులలో ఒకరైన బాబ్ ఖథింగ్ పురాతన బౌద్ధ సంఘారామాల పట్టణమైన తవాంగ్‌ను భారతదేశ నియంత్రణలోకి తీసుకురావడంలో కీలకపాత్ర వహించారు. ఇండో--టిబెటన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఎగువ శుభంసిరి లోయలోని ఆదివాసులతో సంబంధాలు ఏర్పరచుకున్న భారత ప్రభుత్వ అధికారులలో ఎస్ఎమ్ కృష్ణాత్రి ప్రప్రథముడు. నీఫాకు ఎల్విన్ నిర్దేశించిన, నెహ్రూ ఆమోదించిన పాలనా వ్యూహాలను సమర్థంగా, మానవీయంగా అమలుపరిచినవారుగా ఐఎఫ్ఏఎస్ అధికారులు గౌరవమన్ననలు పొందారు. భారత్ శరణు కోరిన దలైలామాను చైనా ఆక్రమిత టిబెట్ నుంచి మన దేశానికి సురక్షితంగా తీసుకురావడంలో హర్‌మందర్ సింగ్ కీలకపాత్ర వహించారు. ఆయన తన డైరీలో నమోదు చేసిన రోజువారీ విశేషాల ఆధారంగా రాణీసింగ్ తన ‘ూఅ గాటటఅఎవతీ ఖఅస ఎఅం ఎశీశ్రీఅఅవం’లో భారత్‌కు దలైలామా పలాయన ప్రస్థానాన్ని విపులంగా వివరించారు. 1959లో దలైలామా భారత్‌లో ఆశ్రయం పొందాలని నిర్ణయించుకుని కామెంగ్ ఫ్రాంటియర్ డివిజన్‌లోకి ప్రవేశించారు. హర్‌మందర్ సింగ్ ఆ డివిజన్‌కు రాజకీయ అధికారి. అసిస్టెంట్ పొలిటికల్ ఆఫీసర్ టీఎస్ మూర్తి ఇండో--టిబెటన్ సరిహద్దులో దలైలామాతో సౌహార్దపూర్వకంగా సమావేశమయ్యారు. కామెంగ్ ఫ్రాంటియర్ డివిజన్ ప్రధాన పరిపాలనా స్థావరమైన బొమ్డిలా నుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న తవాంగ్ పట్టణానికి (ఆ రోజుల్లో ఆ హిమాలయ పొలిమేర ప్రాంతాల్లో మోటారు వాహనాలు ప్రయాణించగల రోడ్లు లేవు) గుర్రాలపై వెళ్లి దలైలామాను సాయుధ సంరక్షణతో ఆ బౌద్ధ క్షేత్రానికి తీసుకువచ్చి ఆయనకు, ఆయన పరివారానికి సకల సదుపాయాలు కల్పించే బాధ్యత నిర్వహించారు. తవాంగ్‌లో 6 ఏప్రిల్ 1959న దలైలామాకు ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పంపిన సందేశాన్ని హర్‌మందర్ సింగ్ చదివి విన్పించారు. ఆ చరిత్రాత్మక సందేశం: ‘మీరు భారత్‌కు సురక్షితంగా చేరుకోవడాన్ని నేను, నా సహచరులు ఆహ్వానిస్తున్నాము. మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. మీరు, మీ కుటుంబం, మీ సహచరులు భారతదేశంలో నివసించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు మేము సంతోషిస్తాము. మిమ్ములను అత్యంత పవిత్రంగా, భక్తి శ్రద్ధలతో గౌరవించే భారతీయులు ఎప్పటిలాగే తమ సంప్రదాయ మర్యాదలను పరిపూర్ణంగా చూపుతారు’.తవాంగ్ నుంచి దలైలామా, ఆయన బృందాన్ని బొమ్డిలాకు హర్‌మందర్ సింగ్ తీసుకువెళ్లారు. టిబెటన్లు బుద్ధుడి అవతారంగా ఆరాధించే దలైలామా (అప్పటికి ఆయన తన తొలి ఇరవైలలో ఉన్నారు), భారత గణతంత్ర రాజ్య పౌర పాలకుడిగా విశిష్ట విధులు నిర్వర్తిస్తున్న హర్‌మందర్ సింగ్ (తన తొలి ముప్పైలలో ఉన్న యువ అధికారి) మార్గమధ్యంలో (ఒక దుబాసి సహకారంతో) సంభాషించుకున్నారు. ఆ మాటామంతీలో ఒక స్నేహబంధం కుసుమించింది. మాతృభూమి నుంచి ప్రవాసానికి వచ్చి, ఆత్మీయ ప్రజలకు దూరమైన యువ ఆధ్యాత్మిక గురువు దలైలామా స్థితప్రజ్ఞత, ఆయన మాటల్లో నిండుగా వ్యక్తమైన ఆశావాదం గురించి తదనంతర కాలంలో హర్‌మందర్ సింగ్ ప్రగాఢ అనుభూతితో రాశారు. బౌద్ధ ఆధ్యాత్మిక --రాజకీయ నాయకుడు, నికార్సయిన లౌకికవాద పౌర అధికారి మధ్య నెలకొన్న పరస్పర గౌరవాభిమానాలు హర్‌మందర్ జీవిత పర్యంతం వర్ధిల్లాయి. ఇండియన్ ఫ్రాంటియర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌ను 1968లో రద్దు చేశారు. అయితే ఈ ప్రత్యేక సివిల్ సర్వెంట్లు తదనంతరం వివిధ కీలక బాధ్యతలు నిర్వహించి జాతి నిర్మాణంలో సమున్నత పాత్ర వహించారు. హర్‌మందర్ సింగ్ అండమాన్స్ అండ్ నికోబార్ చీఫ్ కమిషనర్ అయ్యారు. బాబ్ ఖథింగ్ బర్మాలో మన రాయబారిగా పనిచేశారు. ఆర్ఎన్ హల్దిపర్ కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరికి లెఫ్టినెంట్ గవర్నర్ అయ్యారు. కేసీ జొహొరె గోవా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అయ్యారు. మర్కొట్ రామ్మునీ నేపాల్, బంగ్లాదేశ్‌లో మన రాయబారిగా సేవలు అందించారు. నాగాలపై ఒక ఆసక్తికరమైన పుస్తకాన్ని కూడా ఆయన రాశారు. వెరియర్ ఎల్విన్ జీవిత చరిత్రలో నేను ఇలా రాశాను: ‘ఐఎఫ్ఏఎస్ క్యాడర్ సమర్థులైన యువ అధికారులు, తమ విధ్యుక్త ధర్మాల నిర్వహణకు సంపూర్ణంగా అంకితమైనవారు... ఏ ప్రజల బాగోగులను చూసే బాధ్యతను ప్రభుత్వం తమకు అప్పగించిందో ఆ ప్రజలతో కలిసిమెలిసి జీవించేందుకు సిద్ధమైనవారు, అంతకంటే ముఖ్యంగా ఆ ప్రజల మాదిరిగా ఆలోచించినవారు. విశిష్ట గుణసంపన్నులైన ఈ అధికారులు భారత రాజకీయ చరిత్రలో అద్వితీయులు’. ఈ సేవావ్రతుల గురించి భారత్--టిబెట్ సంబంధాల చరిత్రకారుడు క్లాడ్ అర్పి ఇలా రాశారు: ‘ఐఎఫ్ఏఎస్‌లో చేరేందుకై తమ ఉజ్వల వృత్తి జీవితాలను త్యాగం చేసేందుకు వెనుకాడని ఉదాత్తులు ఈ అధికారులు. పాలనలో ఉత్కృష్ట ప్రమాణాలను నెలకొల్పినవారు. ఆ ప్రత్యేక సర్వీసు ఇప్పుడు లేనప్పటికీ ఆ అధికారులను ఈనాటి యువ ఐఏఎస్, ఐపీఎస్ క్యాడర్ ఆదర్శంగా తీసుకోవాలి. అరుణాచల్ ప్రదేశ్ నేడు ఇతర భారతీయ రాష్ట్రాలకు భిన్నంగా లేదు. ప్రభుత్వ వ్యవస్థల్లో అంతులేని అవినీతి తాండవమాడుతోంది. రాజకీయవేత్తలు, కాంట్రాక్టర్లు కుమ్మకై ప్రభుత్వ ఖజానాను దోచుకుంటున్నారు. ఆ హిమాలయ రాష్ట్రంలో పర్యావరణ విధ్వంసం మరింత వేగంగా జరుగుతోంది. అయితే అరుణాచల్ ప్రదేశ్‌లో ఇతర ఈశాన్య భారత రాష్ట్రాలలో వలే విచ్ఛిన్నకర తిరుగుబాటు కార్యకలాపాలు లేవు. నెహ్రూ, ఎల్విన్‌లు రూపొందించిన దార్శనిక విధానాలు, వాటి అమలులో ఐఎఫ్ఏఎస్ అధికారుల నిస్వార్థ సేవాపరాయణతే అందుకు ప్రధాన కారణాలని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

## కూకట్ పల్లి నియోజకవర్గం వసంతనగర్ డివిజన్ లో ఫోనిక్స్ ఫిట్నెస్ జిమ్ ప్రారంభించబడింది..







( జూన్ - 27- హంస కలంవార్త )

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ అనిల్ కుమార్ యాదవ్ ( ఎంపీ రాజ్యసభ) హాజరు అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలను వదిలి ..శరీర పౌష్టికానికి వ్యాయామం చేయాలని యువతకు సూచించారు.... ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, జిమ్ నిర్వాహకులు పృధ్వి, సుబ్రహ్మణ్యం, బాలాజీ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, కుకట్ పల్లి క్రిస్టియన్ మైనార్టీ సెల్ కోఆర్డినేటర్ మేకల మైఖేల్, ఏఎంసి డైరెక్టర్ ఫణీంద్ర కుమార్ , కూకట్ పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కలికోట శంకర్, మహిళా సీనియర్ నాయకులు వనజ,స్వాతి రెడ్డి, కోమలి, టీం ఎస్ ఎస్ ఆర్.. కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు....

# విశ్వబ్రాహ్మణ కులాన్నే మాయం చేసే కుట్ర








**-రాజ్యాధికారంలో వాటా అడుగుతారని భయం**
**-అందుకే జనాభా లెక్కల్లో వేర్వేరుగా లెక్కలు**
**-డిమాండ్ల సాధనకు త్వరలో కార్యాచరణ**
**-రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం**

( జూన్ - 27- హంస కలంవార్త )

విశ్వబ్రాహ్మణుల కులాన్ని మాయం చేసే కుట్రలో భాగంగానే పాలకులు కులగణనలో అయిదు వృత్తులను వేర్వేరు కులాలుగా నమోదుచేశారని ఆ సామా జిక వర్గం ప్రముఖులు, మేధావులు ఆరోపించారు. సృష్టి ఆరంభం నుంచీ మానవాళికి దిక్సూచిగా ఉన్న విశ్వకర్మల లెక్కలు తేలితే... ఎక్కడ రాజ్యాధికారంలో వాటాలు ఇవ్వాల్సి వస్తుందోనన్న భయంతోనే అగ్రకులాలు, పాలకులు కలిసి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విభజించు-పాలించు అనే సూత్రాన్ని అమలుచేస్తూ... ఏకంగా విశ్వబ్రా హ్మణ కులాన్ని విడగొట్టి విచ్ఛిన్నం చేయడానికి ఉద్దేశపూర్వకంగానే అయిదు వృత్తులను అయిదు కులాలుగా కులగణనలో చూపించే యత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మెట్రో ఈవినింగ్స్ పత్రిక చీఫ్ ఎడిటర్ దేవరకొండ కాళిదాస్, విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు అడ్లూరి రవీంద్రాచారి, పెద్దలు దాసోజు గోవర్ధన్ చారి, కుందారం గణేశ్‌చారి, మదన్‌మోదన్, బొడ్డుపల్లి సుందర్, యాదగిరి, తదితరులు పాల్గొని ప్రసంగి ంచారు. ఈ మేరకు పలు తీర్మానాలపై చర్చ జరిగింది. డీకే పబ్లికేషన్స్ అధినేత దేవరకొండ కాళిదాస్ ప్రారంభోపన్యాసం చేస్తూ... కుట్రపూరితంగానే అయిదు వృత్తుల వారిని వేర్వేరు కులాలుగా గుర్తించి, విశ్వబ్రాహ్మణ కులాన్ని బలహీనపర్చారని పేర్కొన్నారు. విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి ముగింపు ఉపన్యాసం చేస్తూ, అన్ని జిల్లాల విశ్వకర్మ ప్రముఖులతో జులై 7న మరో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ... అధికారం, సంపద అంతా కూడా అగ్రకులాల ఆధీనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలలో విశ్వకర్మల జనాభా అసలు లెక్కలు తేలితే... రాజ్యాధికారంలో వాటా అడుగుతారన్న భయంతోనే... అయిదు వృత్తులు చేస్తున్న విశ్వబ్రాహ్మణులను అయిదు వేర్వేరు కులాలుగా గణిస్తున్నారని తెలిపారు. నేడు ఎన్నికల ముఖచిత్రం చూస్తే... కేవలం 2-3 శాతం ఓట్ల తేడాలో ప్రభుత్వాలు తారుమారు అవుతున్నాయని చెప్పారు. అందుకే తెలంగాణలో 4-5 శాతం జనాభా ఉన్న విశ్వబ్రాహ్మణులను విభజిస్తున్నారని విమర్శిం చారు. కాబట్టి... విశ్వకర్మీయులే తమ కులగణనకు సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు.

# ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుంది

**- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

( జూన్ - 27- హంస కలంవార్త )

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.ార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన ప్రక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన ప్రక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరు.



## రెండు కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్

( జూన్ - 27- హంస కలంవార్త )

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పి జె ఆర్ నగర్ లో రెండు కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ పీజేఆర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను నాణ్యతప్రమానాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుంది అని, అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్ ను అన్ని హంగుల తో సకల సౌకర్యాల తో నిర్మిస్తామని మాజీ కార్పొరేటర్ తెలియచేసారు. ఫంక్షన్ హాల్ పేద మధ్య తరగతి ప్రజలకు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలియచేసారు. ఫంక్షన్ హాల్ లో వివాహాది శుభకార్యాలు, సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫంక్షన్ హాల్ ఉపయోగపడుతుంది అని అన్నారు. ఫంక్షన్ హాల్



మరియు చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శశిధర్ పట్వారీ, జి.రవి, యాదగిరి, అగ్రవాసు, వాలి నాగేశ్వరరావు, శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## శనివారం రోజు ఉదయం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి,

( జూన్ - 27- హంస కలంవార్త )



విశ్వబ్రాహ్మణ భవనం నిర్మాణానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.5 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి చైర్మన్ వేములవాడ మదనమోహన్ , ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి సుందర్ , కుందారం గణేష్ చారి పాల్గొన్నారు. అలాగే అక్కడ ఉన్న విశ్వకర్మ సంఘ సభ్యులు కూడా ఈ సందర్భంగా హాజరై తమ మద్దతు తెలిపారు. మంత్రి మా విజ్ఞాపనను ఎంతో శ్రద్ధగా విని చాలా సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం ఇప్పటికే ఈ విషయంపై నిర్ణయం తీసుకున్నందున, "మీకు ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటాను. వీలైనంత త్వరలో ఈ అంశాన్ని పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాను" అని స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విశ్వబ్రాహ్మణుల న్యాయమైన డిమాండ్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తానని మంత్రి తెలిపారు. మంత్రి కి మన సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, మన అందరి ఐక్యత, సహకారంతో విశ్వబ్రాహ్మణ భవనం కల త్వరలోనే సాకారం అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాము. ధన్యవాదాలు. సుందర్ బొడ్డుపల్లి ప్రధాన కార్యదర్శి

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ గురుకుల విద్యార్థులకు శుభవార్త అందించింది.



( జూన్ - 27- హంస కలంవార్త )

ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులందరికీ ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందించాలని నిర్ణయించింది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కీలక నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయం విద్యార్థుల భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేస్తుందని భావిస్తున్నారు.

## డి.వి.జి ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థికసాయం

( జూన్ - 27- హంస కలంవార్త )



ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పిజేఆర్ నగర్ కాలనీ బ్లాక్ నెంబర్ 71లో నివసించే శ్రీనివాస్(52) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. శశిధర్ పట్వారీ, జి.రవి, యాదగిరి, అగ్రవాసు, నాగేశ్వరరావు వాలి, అనిల్ కుమార్, జి నాగేశ్వరరావు, అప్పలనాయుడు, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## ప్రముఖ సాంస్కృతిక సంస్థ శ్రీ సాయి అలేఖ్య ఆధ్వర్యంలో

( జూన్ - 27- హంస కలంవార్త )



దివంగత నాయకుడు గొట్టిముక్కల పద్మారావు సంస్మరణ సభ శనివారం వివేకానంద నగర్ కాలనీలోని ఆయన గృహంలో జరిగింది. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్యఅతిథి హాజరయ్యారు. పద్మారావు చిత్రపటానికి పూలమాలవేసి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల్లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సందర్భంగా పద్మారావు సేవలను ఆయనతో తనకున్న అనుబంధాన్ని రమేష్ గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల పాండు కొప్పిశెట్టి దినేష్ కుమార్ ,రంగమోహన్, సంస్థ ఆర్గనైజర్ అరుణ, లక్ష్మణ్ గౌడ్. అరవింద్ రెడ్డి, నలిని కాంతు, పిడికిలి గోపాల్ చౌదరి, రాజేందర్, అస్లాం, రంగమ్మోహన్, శ్రీనివాస్ బాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్.. ఐ టి ఓ లో

( జూన్ - 27- హంస కలంవార్త )



రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన కొండాపూర్ కు చెందిన జెస్సికా ను కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో సత్కరించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులు, క్రీడల్లో రాణిస్తూ తల్లిదండ్రులకు.. గురువులకు పుట్టిన ఊరుకు గౌరవం తీసుకొస్తూ ముందుకు వెళ్లాలని.. అనుకున్న లక్ష్యం వైపు గురి పెట్టుకుని ప్రణాళిక రచించుకోవాలని అన్నారు.. ఈ కార్యక్రమంలోమాజీ బివరేజస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నగేష్, కొండాపూర్ బిఆర్ఎస్ ఇంచార్జ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 3 నాటికి ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి

-ప్రతి అర్హ ఓటరికి తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలి

-ప్రగతి నగర్‌లో ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



హంసకలం వార్త

ఓటరు నమోదు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా జులై 3వ తేదీలోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని 4 వ వార్డు ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్షపరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జులై 3 నాటికి ఫారాల పంపిణీ ప్రక్రియను పూర్తిస్థాయిలో ముగించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో బీఎల్‌వోలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పూర్తి సహకారం అందిస్తూ ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, ఒక ఫారాన్ని ఓటరు వివరాలతో నింపించి స్వీకరించగా, మరో ఫారంపై స్వీకరణ ధృవీకరణ చేసి రసీదుగా ఓటరికి తిరిగి అందజేయాలని సూచించారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానిముదిగొండ గ్రంథాలయానికి మహర్దశ ..

# ఎన్పీఎస్ క్విట్ ఇండియా

-సిపిఎస్ రద్దు కోసం దేశ వ్యాప్త ఉద్యమం

-ఏఐఎన్పీఎస్ఈఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు మాచన రఘునందన్

హంసకలం వార్త




పాత పింఛను పథకం అమలు.న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలన్న డిమాండ్ తో జాతీయ స్థాయిలో ఉద్యోగులు సంఘటితం అవుతున్నారని ఆల్ ఇండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మాచన రఘునందన్ అన్నారు.శనివారం ఎల్బీ నగర్ లో ఆయన మాట్లాడుతూ..కొత్త పింఛను పథకం రద్దు కోసం పోరాటం చేస్తున్న పలు సంఘాలు జులై మొదటి వారంలో ఢిల్లీలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.వన్ రేషన్ వన్ నేషన్,వన్ ఎలక్షన్ వన్ నేషన్ అని మనం ఎలా గొప్పగా చెప్పుకుంటున్నామో,వన్ నేషన్ వన్ పెన్షన్ అనే నినాదంతో ఉద్యోగులు గళం వినిపించనున్నట్లు చెప్పారు.పదవి విరమణ తర్వాత పింఛను రాని కొలువు కన్నా ఆకర్షణీయమైన వేతనం వచ్చే ప్రైవేటు ఉద్యోగమే మిన్న అనే భావన ఉద్యోగుల్లో,నిరుద్యోగుల్లో నిరాశ నెలకొందని అవేదన వ్యక్తం చేశారు.రాజకీయ పార్టీలు, పాలకులు ఎప్పటికప్పుడు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఓపిఎస్ ఇస్తాం,సిపిఎస్ రద్దు చేస్తామని అంటున్నాయే తప్ప,ఎన్నికల తర్వాత తాము ఇచ్చిన హామీల సంగతే మర్చిపోతున్నారని విస్మయం వ్యక్తం చేశారు.హిమాచల్ ప్రదేశ్,ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పాత పింఛను పథకం అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. “మేం న్యూ పెన్షన్ స్కీమ్ నుంచి బయటకు వచ్చేస్తాం” అని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్ స్కీమ్ నుంచి ఎగ్జిట్ కావచ్చన్నారు. ఉద్యోగుల డబ్బుతో ప్రభుత్వాలు జూదం ఆడుతున్నాయని,జన సామాన్యం భావించేలా ప్రభుత్వాలు ఎంత సేపు పాత పింఛను పథకం కంటే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉత్తమమని మాయ మాటలు చెప్పి ఉద్యోగులను అయోమయానికి గురి చేస్తున్నారని అభిప్రాయపడ్డారు.అందుకే పాలకులకు తమ గోడు వినిపించడానికి జాతీయ స్థాయిలో ఉద్యోగ సంఘాల అన్ని ఏకమై “ఎన్పీఎస్ క్విట్ ఇండియా” అని నినదించనున్నట్టు స్పష్టం చేశారు. ఆనాడు గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహించిన తీరులోనే ఈ ఆందోళన కొనసాగే అవకాశం లేకపోలేదన్నారు.

# గొట్టిముక్కల పద్మారావుకు నివాళులు అర్పించిలిశ్రీమతి కల్వకుంట్ల కవిత .



( జూన్ - 27- హంస కలంవార్త )

తెలంగాణ ఉద్యమ నాయకులు, ప్రముఖ సినీ నిర్మాత, సీనియర్ రాజకీయ నాయకుడు దివంగత గొట్టిముక్కల పద్మారావుకు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేసిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి శ్రీమతి కల్వకుంట్ల కవిత .

ఓం శాంతి

# కూకట్ పల్లి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ఇతర అధికారులతో







( జూన్ - 27- హంస కలంవార్త )

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఎస్ ఐ ఆర్ లో భాగంగా ప్రతీ ఓటరును కలిసి ఎన్యూమరేషన్ ఫారాన్ని అందజేస్తున్న విషయం తెలిపి ఎమ్మెల్యే కి కూడా ఎన్యుమరేషన్ పత్రాన్ని అందజేశారు. అనంతరం అధికారులు వారి కుటుంబ సభ్యుల ఓటరు పరిశీలన కార్యక్రమం నిర్వహించారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు... అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా కొద్ది సమయాన్ని కేటాయించి తమ ఓటు హక్కు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఎవరికైనా తమ తమ ఓటు హక్కును కాపాడుకునే విషయంలో సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితా సమగ్ర పరిశీలన విషయంలో అధికారులకు సహకరించి అదేవిధంగా తమకున్న సందేహాలను కూడా నివృత్తి చేసుకోవాలని సూచించారు. కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలో ఎవరికైనా ఎస్ ఐ ఆర్ పై అనుమానాలు ఉంటే తమను మాధ వరం కృష్ణారావు ఫోన్ 9394115559) నంబర్లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం సభ్యత్వ నమోదు ( పార్టీ ) ఇంఛార్జ్ గజ్జెల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

-బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత

హంసకలం వార్త



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు. మేడిపెల్లి మండలంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు.ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# చినుకుల సాక్షిగా.. ప్రగతి అడుగులు..

-వర్షపు జల్లుల మధ్యే కూసుమంచి మండలంలో రూ. 16.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి

-వానాకాలం రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారంగా వంతెనలు.. బీటీ రోడ్లు

హంసకలం వార్త



కూసుమంచి :ఆకాశం నుంచి వర్షపు చినుకులు నేలను తాకుతున్నా.. వాతావరణం అనుకూలించకపోయినా లెక్కచేయకుండా, గ్రామీణ రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రగతి బాట సాగింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా... వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. వానలు పడుతున్నా ప్రజల కోసం ప్రగతి పనులు ఆపబోమని, అధికారులు కూడా అంతే వేగంతో నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

-రూ. 16.13 కోట్లతో శంకుస్థాపనలు..

మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు గైగోల్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జడ్పీ రోడ్డు నుండి కొత్తూరు - ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్ సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్ళే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నిజయోజక, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు.

హంసకలం వార్త



పోలీస్ శాఖలో పరిపాలనా దక్షత, పారదర్శకతను పెంపొందించే భాగంలో భాగంగా శనివారంనాడు తిమ్మాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలను సీపీ గౌష్ ఆలం నిర్వహించారు. ఈ సమగ్ర సమీక్షలో కార్యాలయ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, ప్రజల ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియల సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.తనిఖీల్లో భాగంగా కార్యాలయ ప్రాంగణంలోని అంతర్గత, బాహ్య పరిసరాల పరిశుభ్రతను సీపీ నిశితంగా పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలోని స్టేషన్ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు మరియు వాటి దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు.తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలోకి వచ్చే మూడు పోలీస్ స్టేషన్లయిన తిమ్మాపూర్, ఎల్.ఎమ్.డి కాలనీ, చిగురుమామిడిల పనితీరుపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించిన సీపీ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, మరియు స్థానిక సమస్యల పరిష్కారంపై చర్చించారు. ప్రస్తుతం సర్కిల్ పరిధిలోని అన్ని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందని, కేసుల దర్యాప్తు పురోగతి సంతృప్తికరంగా ఉందని సీపీ పేర్కొన్నారు. సుమారు నెల రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించిన కొత్త సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్, అప్పుడే సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుం టుండటాన్ని ఈ సందర్భంగా అభినందించారు.మరింత సమర్థవంతమైన, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ వ్యవస్థను అందించేందుకు రాష్ట్ర డి.జి.పి జారీ చేసిన ఆదేశాలను ఈ తనిఖీల్లో భాగంగా చర్చించామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తూ, గ్రామాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు సీపీ జారీచేశారు. మొత్తంగా తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయ పనితీరు మరియు సన్నద్ధత ప్రశంసనీయంగా ఉందని సీపీ సంతృప్తి వ్యక్తం చేస్తూ స్థానిక అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్, ఎస్సైలు అన్వర్, గన్నేరువరం ఎస్సై నరేందర్ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాం

**-నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

హంసకలం వార్త

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి, రోడ్లపైకి వర్షపు నీరు చేరకుండా ఉండేందుకు అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. డ్రైనేజీల పూడికతీత పనులను పరిశీలించిన సందర్భంగా సిల్ట్ కంటే భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నాయని మేయర్ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఇంటింటికీ 'స్వచ్ఛ ఆటోలు' ద్వారా చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ, కొందరు నిర్లక్ష్యంగా ప్లాస్టిక్ కవర్లు, చెత్తను డ్రైనేజీల్లో వేయడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమని, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. అందువల్ల నగర ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, "ప్లాస్టిక్ రహిత కరీంనగర్" లక్ష్య సాధనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చెత్త సేకరణలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే స్థానిక కార్పొరేటర్ల దృష్టికి తీసుకువస్తే వెంటనే స్వచ్ఛ ఆటోలను పంపించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. నగర పరిశుభ్రతను కాపాడేందుకు రోడ్లపై, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేదా ఇతర చెత్తను వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నగర ప్రజలకు మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో పాటు స్థానిక కార్పొరేటర్ బండారి వేణు, మాజీ కార్పొరేటర్ జితేందర్, సాదవేని శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.




# శని త్రయోదశి వేళ భీమేశ్వరుడిని దర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హంసకలం వార్త

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రభుత్వ విప్‌కు అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. శని త్రయోదశి సందర్భంగా ఆలయంలోని నవగ్రహ మండపంలో శనీశ్వర స్వామివారికి నువ్వుల నూనెతో తైలాభిషేకం నిర్వహించారు. నల్ల వస్త్రం సమర్పించి, నవధాన్యాలతో ప్రత్యేక అర్చనలు చేశారు. శని దోష నివారణ కోసం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వామివారి తీర్థప్రసాదం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందించి వేదాశీర్వచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఏఈఓలు జి. శ్రావణ్ కుమార్, జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నూగూరి నరేందర్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.



# అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పులుల లెక్కింపు విజయవంతం

హంసకలం వార్త

నాగర్‌కర్నూల్:జిల్లా పరిధిలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అఖిల భారత పులుల లెక్కింపు (ఏఐటీఈ - 2026) విజయవంతంగా పూర్తయింది. 2025 నవంబర్ నుంచి 2026 జూన్ వరకు ఎనిమిది నెలల పాటు ఈ సర్వేను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించారు. మొత్తం 2,611 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రిజర్వ్‌ను 2 చదరపు కిలోమీటర్ల గ్రిడ్లుగా విభజించి సర్వే చేపట్టారు. ఇందుకోసం 1,120 ప్రాంతాల్లో 2,240 కెమెరా ట్రాపులను ఏర్పాటు చేశారు. నాలుగు బ్లాకులుగా విభజించి ప్రతి బ్లాక్‌లో 30 రోజుల పాటు కెమెరా ట్రాప్ సర్వే నిర్వహించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ప్రస్తుతం మొత్తం 42 పెద్ద పులులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో 18 ఆడ పులులు, 14 మగ పులులు, అలాగే 2 ఉప-వయోజన పులులు, 8 పులి పిల్లలు నమోదయ్యాయి. పులి పిల్లల నమోదు విజయవంతమైన సంతానోత్పత్తికి సంకేతమని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ సర్వేను ఎన్‌టీసీఏ (నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ) మార్గదర్శకాల ప్రకారం శాస్త్రీయంగా నిర్వహించారు. ఫీల్డ్ డైరెక్టర్ డా. సునీల్ ఎస్. హిరేమత్, డీఎఫ్ఓ రేవంత్ చంద్ర పర్యవేక్షణలో అటవీ అధికారులు, ఫీల్డ్ సిబ్బంది, జీవశాస్త్ర నిపుణులు, హైటికస్ బృందం కలిసి సర్వేను విజయవంతం చేశారు. ఈ లెక్కింపు ద్వారా పులుల సంఖ్య, వాటి వ్యాప్తి, ఆహార జంతువుల లభ్యత, నివాస ప్రాంతాల పరిస్థితులపై కీలక సమాచారం సేకరించబడింది. నల్లమల అడవులు పులులకు ఆరోగ్యకరమైన, అనుకూలమైన నివాస ప్రాంతంగా మరోసారి ఈ సర్వే నిర్ధారించింది. పులుల సంరక్షణతో పాటు శాస్త్రీయ వన్యప్రాణి పర్యవేక్షణలో ఈ సర్వే కీలక మైలురాయిగా నిలిచిందని అధికారులు తెలిపారు.



# 18 వేల అడుగుల ఎత్తులో స్కైడైవింగ్ చేసిన భారతీయ తాత

**-ధైర్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన వైనం**

హంసకలం వార్త

వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని మరోసారి నిరూపించారు ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ఓ భారతీయ వృద్ధుడు. సాధారణంగా 18 వేల అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేయాలంటే యువకులే వెనుకడుగు వేస్తారు. కానీ, ఈ తాత మాత్రం అపారమైన ఆత్మవిశ్వాసంతో ఆ సాహసాన్ని విజయవంతంగా పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో వైరల్ గా మారింది. ఈ సందర్భంగా స్కైడైవింగ్‌కు ముందు ఆయన మనవడు "మీకు భయంగా ఉందా?" అని అడగ్గా, చిరునవ్వుతో "భయపడటానికి నేను ఎవరు?" అని ధైర్యంగా సమాధానం ఇచ్చారు. అనంతరం విమానం నుంచి దూకే సమయంలో "జై హింద్..జై భారత్..జై హరియాణా" అంటూ నినాదాలు చేయడం అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా నెటిజన్లు తాత ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ,"వయసు కాదు...మనసే మనిషిని గొప్పవాడిని చేస్తుంది", "ఇలాంటి ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరికీ ఆదర్శం" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు కలలు కనడానికి, కొత్త సాహసాలు చేయడానికి, జీవితాన్ని ఆస్వాదించడానికి వయసు అడ్డంకి కాదు. ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉంటే అసాధ్యం అనుకున్నదీ సాధ్యమేనని నిరూపించాడు ఈ భారతీయ తాత.



# ఆపరేషన్ సింధూర్‌లో అమరులైన ఆరుగురు వీర జవాన్ల వివరాలు వెల్లడించిన కేంద్రం

హంసకలం వార్త

పాకిస్థాన్ దాడులకు ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం గత ఏడాది చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సందర్భంగా అమరులైన ఆరుగురు సైనికుల వివరాలను కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా వెల్లడించింది. శుక్రవారం ఈ వివరాలను జాతీయ యుద్ధ స్మారక వెబ్‌సైట్‌లోని గౌరవ పట్టికలో ప్రచురించడంతో పాటు, న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నం 3డీ గోడపై కూడా వారి పేర్లను శాశ్వతంగా పొందుపరిచింది. అమర వీరుల్లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, భారత వైమానిక దళానికి చెందిన ఒకరు ఉన్నారు. వీరిలో సుబేదార్ మేజర్ పవన్ కుమార్, రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్, లాన్స్ నాయక్ దినేశ్ కుమార్, హవల్దార్ సునీల్ కుమార్ సింగ్, వైమానిక సాంకేతిక నిపుణుడు మూడ్ మురళీ నాయక్, భారత వైమానిక దళానికి చెందిన సార్జెంట్ సురేంద్ర కుమార్ ఉన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఈ వీర జవాన్ల సేవలను దేశం ఎప్పటికీ మరవదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. వారి త్యాగం భారత సైనికుల ధైర్యసాహసాలకు చిరస్మరణీయ చిహ్నంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.



# ప్రజా పాలన ప్రగతికి ప్రశంసల ముద్ర

**-జిల్లా పనితీరును అభినందించిన అధికారి శైలజా రామయ్యర్.**




హంసకలం వార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పాలనను ప్రజలకు మరింత చేరువ చేసిందని జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ, పర్యావరణ, అటవీ శాస్త్ర--సాంకేతిక శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్ కార్యాచరణపై జిల్లా యంత్రాంగం రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను శైలజా రామయ్యర్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ ప్రతి శాఖ భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని, 99 రోజుల కార్యక్రమంలో సాధించిన ఫలితాలను డాక్యుమెంటరీ రూపంలో నమోదు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి, డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం నిర్వహణ, రోడ్డు భద్రతలో భాగంగా సీపీఆర్ శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు తదితర రంగాల్లో జిల్లా సాధించిన పురోగతిని ఆమె అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేసిన జిల్లా యంత్రాంగాన్ని ప్రశంసించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఆర్ఓ జయశ్రీ, సీపీఓ శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పశువైద్యాధికారి రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

**-115 వాహనాలు సీజ్**



హంసకలం వార్త

తప్పు నంబర్ ప్లేట్లు, నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కఠిన చర్యలు ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శనివారం వన్‌టౌన్ కార్నర్ వద్ద చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు, తప్పుగా అమర్చిన నంబర్ ప్లేట్లు, అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 115 వాహనాలను సీజ్ చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం సంబంధిత నిబంధనల మేరకు జరిమానాలు విధించడంతో పాటు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి మాట్లాడుతూ, ప్రతి వాహనానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా స్పష్టంగా కనిపించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ఉండాలని తెలిపారు. నంబర్ ప్లేట్లను మార్చడం, స్టిక్కర్లు లేదా ఇతర డిజైన్లతో నంబర్లు కనిపించకుండా చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇలాంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్యతో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# స్పోర్ట్స్

## బేస్‌బాల్ ప్లేయర్‌గా మారిన ఇంగ్లండ్ ప్రపంచ కప్ విజేత




**స్పోర్ట్స్ డెస్క్:**
అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత మరో క్రీడలో ప్రొఫెషనల్ ప్లేయర్‌గా రాణించడం చాలా అరుదు. ఇంగ్లండ్ మాజీ స్టార్ ఫాస్ట్ బౌలర్, 2019 వన్డే ప్రపంచకప్ సభ్యుడు లియామ్ ప్లంకెట్ ఇప్పుడు సరిగ్గా అదే చేసి చూపించాడు. 41 ఏళ్ల ప్లంకెట్ అమెరికాలోని ఓక్లాండ్ బేలర్స్ తరపున ప్రొఫెషనల్ బేస్‌బాల్‌లోకి అరంగేట్రం చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. దీంతో ప్రొఫెషనల్ బేస్‌బాల్ ఆడిన తొలి ఇంగ్లిష్ క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ప్లంకెట్ 2021లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆ తర్వాత అమెరికన్ మహిళను వివాహం చేసుకొని అక్కడే స్థిరపడ్డాడు. అక్కడ మేజర్ లీగ్ క్రికెట్ లో ఆటగాడిగా, కోచ్‌గా సేవలందించాడు. 'పయనీర్ బేస్‌బాల్ లీగ్' ప్రత్యేక మార్కెటింగ్ నిబంధనల ప్రకారం 'ఓక్లాండ్ బేలర్స్' జట్టు ప్లంకెట్‌తో ఒప్పందం చేసుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో లీగ్ తరఫున అరంగేట్రం చేసిన ప్లంకెట్.. తన మొదటి బంతికే బ్యాటర్‌ను 'స్ట్రైకౌట్' చేయడం విశేషం. దీనిపై అతను స్పందిస్తూ.. 'మొదట్లో ఇది కేవలం ప్రదర్శన మ్యాచ్ అనుకున్నాను. కానీ నిజమైన ప్రొఫెషనల్ మ్యాచ్ అని తెలిసి కాస్త కంగారు పడ్డా. నా బౌలింగ్ యాక్షన్, పిచింగ్ కలయికతో వేసిన బంతిని బ్యాటర్ అంచనా వేయలేకపోయాడు. తొలి మ్యాచ్‌లోనే స్ట్రైకౌట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని ప్లంకెట్ సంతోషం వ్యక్తం చేశాడు. 2005లో అంతర్జాతీయ క్రికెట్ ప్రస్థానాన్ని ప్రారంభించిన ప్లంకెట్, ఇంగ్లండ్ తరఫున 13 టెస్టులు, 89 వన్డేలు, 22 టీ20లు ఆడి 130కి పైగా వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా 2019 ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ సహా కీలక వికెట్లు తీసి ఇంగ్లండ్ తొలిసారి ఛాంపియన్‌గా నిలవడంలో ముఖ్య పాత్ర పోషించాడు.

## అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ రద్దు.. ఎందుకంటే!




**స్పోర్ట్స్ డెస్క్:**
ఐర్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత్ జట్టు ఘోరంగా ఓడిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రమే రాణించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఈ ఓపెనింగ్ బ్యాటర్ మాత్రం దూకుడుగానే ఆడుతూ స్కోరు బోర్డుపై పరుగులు జమ చేశాడు. ఈ క్రమంలోనే అభిషేక్ శర్మ 19 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. ఇందుకు సంబంధించిన బీసీసీఐ ట్వీట్ కూడా చేసింది. అభిషేక్ శ్మర సైతం తన కెరీర్‌లోని మరో హాఫ్ సెంచరీని చేసినట్లు సెలబ్రేట్ చేసుకున్నాడు. అయితే, ఆ వెంటనే 7.6వ ఓవర్‌లో లియామ్ మెకర్తీ బౌలింగ్‌లో బెంజమిన్‌కు క్యాచ్ ఇచ్చి అభిషేక్ శర్మ పెవిలియన్‌కు చేరాడు. ఇక్కడే ఓ ట్విస్ట్ చోటుచేసుకుంది. అభిషేక్ శర్మ చేసిన అర్ధ సెంచరీ రద్దైంది. అతడి హాఫ్ సెంచరీని రద్దు చేసినట్లు స్కోరు బోర్డులో రివైజ్డ్ స్కోరు వచ్చింది. దీంతో కాసేపు అభిమానులు షాకయ్యారు. ఇందుకు కారణం మూన్‌డ్రా బౌలింగ్ (భారత్ ఇన్నింగ్స్ 5వ ఓవర్)లో అభిషేక్ శర్మ సింగిల్ తీశాడు. అయితే, ఆ తర్వాత అది లెగ్‌బైగా తేలింది. దీంతో అభిషేక్ ఖాతాలో నుంచి ఆ పరుగు తొలగించారు. ఫలితంగా 20 బంతుల్లో అభిషేక్ శర్మ 49 పరుగులు చేసినట్లు తేలింది. అభిషేక్ ఔటైన అనంతరం, భారత్ దారుణంగా కుప్పకూలింది. ఎనిమిది ఓవర్లలోపే 80/3 స్కోరుకు చేరిన భారత్.. ఆ తర్వాత 148 పరుగులకే ఆలౌట్ అయింది. ఛేజింగ్‌లో ఆ ఎడమచేతి వాటం ఓపెనర్ తప్ప మరెవరూ 25 పరుగుల మార్కును దాటలేకపోవడంతో, ఐర్లాండ్ 34 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆఖరి టీ20 ఆదివారం జరగనుంది. ప్రస్తుతం భారత్ చేతిలో సిరీస్‌ను చేసే అవకాశం మాత్రమే ఉంది.

## ఐర్లాండ్ చేతిలో ఓటమిపై స్పందించిన అభిషేక్ శర్మ




స్పోర్ట్స్ డెస్క్:
విదేశీ పిచ్ పరిస్థితులకు త్వరగా అలవాటు పడకపోవడమే ఐర్లాండ్ చేతిలో భారత జట్టు ఓటమికి ప్రధాన కారణమని యువ బ్యాటర్ అభిషేక్ శర్మ అభిప్రాయపడ్డాడు. బెల్‌ఫాస్ట్ వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో ఐర్లాండ్ జట్టు అద్భుత ప్రదర్శనతో భారత్‌పై 34 పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఏ ఫార్మాట్‌లోనైనా ప్రపంచ టీ20 ఛాంపియన్ భారత్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో అభిషేక్ శర్మ మాట్లాడుతూ.. 'నిరంతర షెడ్యూల్‌తో వెనువెంటనే మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు, కొద్దిపాటి ప్రాక్టీస్ సెషన్లలోనే అక్కడి వాతావరణానికి, పిచ్ పరిస్థితులకు అలవాటు పడటం ఎంతో కీలకం. ఒక బలమైన జట్టుగా మేము ఆ పనిని వేగంగా చేయాల్సి ఉండింది. ఈ రోజు కూడా మేము అదే ప్రయత్నం చేశాం. కానీ దురదృష్టవశాత్తూ అది వర్కవుట్ కాలేదు' అని తెలిపాడు. తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐర్లాండ్.. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొని 183 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో తడబడిన టీమిండియా, ఐరిష్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు వికెట్లు సమర్పించుకుంది. 18.5 ఓవర్లలో 148 పరుగులకే ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ కేవలం 20 బంతుల్లో 50 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆదివారం ఇరుజట్ల మధ్య చివరి టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ నాటికైనా తప్పులను దిద్దుకుని, పరిస్థితులకు త్వరగా అలవాటు పడి బలంగా పుంజుకుంటామని అభిషేక్ ధీమా వ్యక్తం చేశాడు.

## కెప్టెన్‌గా ఇది ఒక గొప్ప ఆరంభం: టీమిండియా కెప్టెన్ అయ్యర్




**స్పోర్ట్స్ డెస్క్:**
2026 టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్ అయిన భారత జట్టుకు ఘోర పరాభవం ఎదురైంది. అలానే టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు తొలి మ్యాచ్‌లోనే ఓటమి చవిచూశాడు. పసికూన ఐర్లాండ్ చేతిలో భారత జట్టు అనూహ్య రీతిలో ఓడిపోయింది. బెల్‌ఫాస్ట్ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో శ్రేయస్ సేన 34 పరుగుల తేడాతో ఐర్లాండ్ చేతిలో పరాజయం పాలైంది. మ్యాచ్ అనంతరం శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. ఓడినప్పటికీ కెప్టెన్‌గా ఇది ఒక గొప్ప ఆరంభమని వ్యాఖ్యానించాడు. శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ..' మ్యాచ్ ప్రారంభంలో మా బౌలర్లు బాగా బౌలింగ్ చేశారని నేను అనుకుంటున్నాను. వారు లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేశారు. అలాగే రెండు వికెట్లు కూడా తీశారు. దాంతో మాకు అద్భుతమైన ఆరంభం లభించింది. కానీ మధ్యలో మేము ఆటపై పట్టు వదిలేసినట్లు అనిపించింది. మా ఇన్నింగ్స్ ఆరంభం కూడా చాలా చక్కగా ప్రారంభమైంది. కానీ మధ్యలో వరుస వికెట్లు పడటంతో మ్యాచ్‌పై పట్టుకోల్పోయాము' అని తెలిపాడు. 'ఏదీ సులువుగా దొరకదు. కఠినంగా శ్రమిస్తేనే విజయం వరిస్తుంది. గతంలో ఏం జరిగిందన్న విషయంతో సంబంధం లేకుండా.. వర్తమానంలో జీవించడం ముఖ్యం. ప్రత్యర్థిని కట్టడి చేసే అవకాశం లభిస్తే.. ఎట్టిపరిస్థితుల్లోనూ చేజారనీయకూడదు. ఇక్కడ వాళ్లు 140 పరుగులు చేయడం గొప్పే అనిపించింది. కానీ వారిని మేము కట్టడి చేయలేకపోయాము. ఇలాంటి పిచ్‌లపై మరిన్ని మ్యాచ్‌లు ఆడాలి. అప్పుడే వికెట్‌పై మాకు ఓ అవగాహన వస్తుంది. ఏదేమైనా కెప్టెన్‌గా నాకిది గొప్ప ఆరంభమే' అని శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నాడు.

# బిజినెస్

## ఏఐతో భారత ఐటీకి కాసుల పంట!




**న్యూఢిల్లీ:**
సంప్రదాయ ఐటీ కంపెనీల సేవలను కృత్రిమ మేధ (ఏఐ) భర్తీ చేయవచ్చన్న ఆందోళనలను పరిశ్రమ నిపుణులు తోసిపుచ్చారు. భవిష్యత్‌లో భారత ఐటీ రంగానికి ఏఐ భారీగా ఆదాయం సమకూరనుందని న్యూయార్క్‌లో జరిగిన నాస్కామ్ యూఎస్ సీఈఓ ఫోరమ్‌లో వారన్నారు. ఏఐ యుగంలో కంపెనీల డిజిటల్ పరివర్తనానికి ఐటీ రంగం కీలకమని వారు పేర్కొన్నారు. దేశీయ ఐటీ కంపెనీలు ఏఐ సేవల ద్వారా ఇప్పటికే 1,000–1,200 కోట్ల డాలర్ల (రూ.95,000 – 1,14,000 కోట్లు) మేర ఆదాయాన్ని గడిస్తున్నాయని, దాదాపు 25 శాతం కంపెనీల ఏఐ ప్రయోగాలు ఉత్పత్తి దశకు చేరుకున్నాయని ఇండస్ట్రీ అసోసియేషన్ నాస్కామ్ తెలిపింది. ఈ అసోసియేషన్ ఇంకా ఏమన్నదంటే.. ఏఐ ఉత్పాదకత ప్రయోజనాలను అందించడంతో పాటు ప్రామాణిక, పునరావృత పనులను కుదిస్తుంది. అలాగే, సాంకేతిక సమన్వయం, డేటా సంసిద్ధత, అప్లికేషన్ మోడ్రనైజేషన్, ఏఐ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏజెంట్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఇండస్ట్రీ ఆధారిత పరిష్కారాలకు గిరాకీని విస్తరింపజేయనుంది. ఇప్పటికే 20 లక్షలకు పైగా ఐటీ ఇంజనీర్లు ఏఐలో నైపుణ్యం కలిగి ఉన్నారు. 1–2 లక్షల మంది అడ్వాన్స్‌డ్ ఏఐలో శిక్షణ తీసుకున్నారు. దాదాపు 85 శాతం టెక్నాలజీ సేవల కంపెనీలు ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్స్‌ను కలిగి ఉన్నాయి. ఏజెంటిక్ ఏఐ సేవలు ఐటీ కంపెనీలకు 2030 నాటికి 30,000 –40,000 కోట్ల డాలర్ల (రూ.28.50–38 లక్షల కోట్లు) ఆదాయ అవకాశాలను సృష్టించే అవకాశాలున్నాయి. ఐటీ రంగ విస్తరణలోనూ సమూల మార్పులు జరగనున్నాయి. భవిష్యత్ వృద్ధి సిబ్బంది పెంపుపై తక్కువగా.. ప్లాట్‌ఫామ్స్, డొమైన్ సొల్యూషన్స్, ప్రొప్రైటరీ అసెట్స్, అవుట్‌కమ్ ఆధారిత డెలివరీపై అధికంగా ఆధారపడనుంది. బిజినెస్ ప్రాసెస్ సేవలు ప్రస్తుత లావాదేవీల ఎగ్జిక్యూషన్ నుంచి ఇంటెలిజెన్స్ ఆపరేషన్స్‌కు మారనున్నాయి. సిబ్బంది కేవలం పర్యవేక్షణ, ఎక్సెప్షన్ హ్యాండ్లింగ్, అనలిటిక్స్, డిసిషన్ సపోర్ట్‌కు మాత్రం పరిమితం కానున్నారు.

## యూనికార్న్‌ల్లో భారత్ నం.4



**న్యూఢిల్లీ:**
ఈ ఏడాదికి గాను ప్రపంచవ్యాప్త యూనికార్న్‌లకు సంబంధించిన జాబితాను హురున్ విడుదల చేసింది. అత్యధిక యూనికార్న్‌లున్న దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే మాత్రం మెట్టు కిందికి జారింది. హురున్ నివేదిక ప్రకారం.. దేశంలో 61 యూనికార్న్‌లున్నాయి. కనీసం ఒక బిలియన్ (100 కోట్ల డాలర్లు = రూ.9,500 కోట్లు) డాలర్ల మార్కెట్ విలువ కలిగిన స్టార్టప్‌లను యూనికార్న్‌గా పిలుస్తారు. 806 యూనికార్న్‌లతో అమెరికా అగ్రస్థానంలో నిలవగా.. చైనా (381), యునైటెడ్ కింగ్‌డమ్ (70) వరుసగా 2, 3 స్థానాలను దక్కించుకున్నాయి. నగరాలవారీగా చూస్తే, 222 యూనికార్న్‌లతో శాన్‌ఫ్రాన్సిస్కో మొదటి స్థానంలో, న్యూయార్క్ (141) రెండో స్థానంలో ఉన్నాయి. బీజింగ్ (86), షాంఘై (74) వరుసగా 3,4 స్థానాల్లో నిలిచాయి. లండన్ ఐదో స్థానంలో ఉండగా.. 25 యూనికార్న్‌లతో బెంగళూరు 9వ స్థానానికి జారుకుంది. 13 యూనికార్న్‌లతో ముంబై 23 స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా 1,603 యూనికార్న్‌లు ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే సంఖ్య 5.3 శాతం (80) పెరిగింది. వీటి మొత్తం మార్కెట్ విలువ 8 లక్షల కోట్ల డాలర్లకు (రూ.760 లక్షల కోట్లు) చేరుకుంది. 2025తో పోలిస్తే విలువ 43 శాతం ఎగబాకింది. గడిచిన ఏడాది కాలంలో కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్‌ల వాల్యుయేషన్లు అనూహ్యంగా పెరగడం ఇందుకు కారణం. భారత్‌లో అత్యంత విలువైన యూనికార్న్ జెప్టో. దా ని విలువ 900 కోట్ల డాలర్లు (రూ.85,500 కోట్లు)గా ఉంది. అంతేకాదు, ప్రపంచ టాప్–100 యూనికార్న్ ల లిస్ట్‌లో ఏకైక భారత స్టార్టప్ కూడా జెప్టోనే. ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్ 96,500 కోట్ల డాలర్లతో ప్రపంచంలోనే అత్యంత విలువైన యూనికార్న్‌గా అవతరించింది. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 7 స్థానాలు ఎగబాకింది. చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్‌ఏఐ 85,200 కోట్ల విలువతో రెండో స్థానంలో కొనసాగుతుండగా.. బైట్‌డాన్స్ (48,000 కోట్ల డాలర్లు), స్ట్రైప్ (15,900 కోట్ల డాలర్లు), డేటాబ్రిక్స్ (13,400 కోట్ల డాలర్లు) వరుసగా 3,4,5 స్థానాల్లో నిలిచాయి.

## డేటా సెంటర్లలోకి బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్




**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్):**
హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ సంస్థ బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్ (బీసీఎ?సఎ?సఎల్) డేటా సెంటర్ల వ్యాపారంలోకి అడుగుపెట్టింది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద 100 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఈఓ చంద్రశేఖర్ ముద్రగణం వెల్లడించారు. ఈ డేటా సెంటర్ కోసం మూడు దశల్లో 35 కోట్ల డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన వివరించారు. తదుపరి దశ విస్తరణలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో డేటా సెంటర్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. కాగా 2025–26లో కంపెనీ ఆదాయం రూ.1,002 కోట్లుగా ఉండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27)లో రూ.3,000 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రశేఖర్ వెల్లడించారు. బ్లూ క్లౌడ్.. హెల్త్‌కేర్ విభాగంలో బ్లూహెల్త్, బ్లూకియోస్క్, బ్లూబయో, బయోస్టర్, బ్లూహెల్త్ పేరుతో పలు ఏఐ ఆధారిత సేవలందిస్తోందని చంద్రశేఖర్ వివరించారు. కంపెనీ హెల్త్‌కేర్ విభాగం.. క్యాన్సర్ సంబంధిత పరిశోధనల కోసం రూ.400 కోట్ల పెట్టుబడితో ఏపీలోని గుంటూరులో బయోబ్యాంక్‌ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కాగా కంపెనీ కార్యకలాపాల విస్తరణ కోసం భారత్‌తో పాటు ఆఫ్రికాలోని పలు దేశాలపై దృష్టి సారిస్తున్నట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' రిలీజ్ డేట్ ఫిక్స్

**వెంకటేష్, త్రివిక్రమ్ కాంబో మూవీ 'ఆదర్శ కుటుంబం'**
**అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల**
**హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టి.. సంగీతం తమన్**
**హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మాణం**
**'ఏకే 47' అనే ట్యాగ్‌లైన్‌తో పెరుగుతున్న ఆసక్తి**





విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'ఆదర్శ కుటుంబం.. హౌస్ నెం.47 (ఏకే-47)'. ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా, ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్రబృందం కీలక ప్రకటన చేసింది. సినిమా విడుదల తేదీని అధికారికంగా ఖరారు చేస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. వెంకటేష్‌కు ఇది 77వ చిత్రం కావడం విశేషం. ఈ సినిమాలో ఆయన సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. 'ప్రతి కుటుంబం గుర్తుంచుకోవాల్సిన తేదీ' అనే క్యాప్షన్‌తో రిలీజ్ చేసిన పోస్టర్‌లో 'ఆదర్శ కుటుంబం' టైటిల్‌తో పాటు 'ఏఖ 47' అని ట్యాగ్ తో సినిమాపై అంచనాలను పెంచేశారు. దీంతో ఇది క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉంటూనే, యాక్షన్ అంశాలు కూడా ఉంటాయనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా, త్రివిక్రమ్ నుంచి చాన్నాళ్ల తర్వాత రాబోతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. 2024లో వచ్చిన 'గుంటూరు కారం' తర్వాత త్రివిక్రమ్ లాంగ్ గ్యాప్ తీసుకున్నారు. ఇప్పుడు 'ఆదర్శ కుటుంబం' తెరకెక్కిస్తున్నారు.

# భాగ్యరాజ్ మృతి కలచివేసింది: చిరంజీవి

**గుండెపోటుతో ఈ ఉదయం మృతి చెందిన భాగ్యరాజ్**
**రెండు రోజుల క్రితమే తాము కలుసుకున్నామన్న చిరంజీవి**
**జోకులు వేసుకుంటూ ఫొటోలు తీసుకున్నామని వెల్లడి**
**భాగ్యరాజ్ మరణ వార్తను నమ్మలేకపోతున్నానన్న చిరు**



ప్రముఖ నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతి వార్తతో సినీ పరిశ్రమ షాక్ కు గురైంది. ఎక్స్ వేదికగా చిరంజీవి స్పందిస్తూ... భాగ్యరాజ్ మరణం తనను తీవ్రంగా కలచివేసిందని, గుండె ఆవేదనతో నిండిపోయిందని, బాధను మాటల్లో వర్ణించలేనని చెప్పారు. "నిన్న కాక మొన్న కూడా గోవాలో కుష్ (కుష్బూ) కుటుంబ వివాహ వేడుకలో భాగ్యరాజ్‌గారితో కలిసి నవ్వుకుంటూ, జోకులు వేసుకుంటూ, ఫొటోలు తీసుకున్నాం. ఆయన ఎంతో ఉల్లాసంగా ఉన్నారు. ఈరోజు ఉదయం ఆయన మరణ వార్త విని నమ్మలేకపోతున్నాను" అని తెలిపారు. "భాగ్యరాజ్ ఒక గొప్ప దర్శకుడు, అసాధారణ స్క్రీన్‌ప్లే రచయిత, నటుడు. భారతీయ సినిమాకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుంటుంది" అని కొనియాడారు. భాగ్యరాజ్ భార్య పూర్ణిమ, కొడుకు, కూతురికి ఈ బాధను తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాని అని చెప్పారు. భాగ్యరాజ్ మృతి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

**విజయ్ సీఎం అయితే రజనీకాంత్ కంగ్రాట్స్ చెప్పలేదని ట్రోల్స్..**

# విష్ణు విశాల్ ఫైర్

**విజయ్ సీఎం అయితే తనకు అసూయ ఎందుకుంటుందన్న రజనీ**
**రజనీలాంటి గొప్ప వ్యక్తి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చిందంటూ విష్ణు విశాల్ ఫైర్**
**మౌనాన్ని వ్యక్తిగత శత్రుత్వంగా మార్చి చూడొద్దని హితవు**



దళపతి విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సూపర్ స్టార్ రజనీకాంత్ ఆయనకు కంగ్రాట్స్ చెప్పలేదంటూ సోషల్ మీడియాలో నెగెటివ్ ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, రజనీకాంత్ మీడియా ముందుకు వచ్చి "విజయ్ సీఎం అయితే నాకెందుకు అసూయ ఉంటుంది? నేను ఏం మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకుంటున్నారు" అంటూ అసహనం వ్యక్తం చేయాల్సి వచ్చింది. తాజాగా ఈ ఇష్యూపై కోలీవుడ్ నటుడు విష్ణు విశాల్ తీవ్రంగా స్పందించారు. తన తాజా చిత్రం 'మట్టి కుస్తీ 2' ప్రమోషన్స్ వేదికగా విష్ణు విశాల్ స్పందిస్తూ... నాలుగు రోజులు ఎవరైనా సెలబ్రిటీ మౌనంగా ఉంటే చాలు.. సొంతంగా ఊహాగానాలు రాసేస్తున్నారని మండిపడ్డారు. కొన్ని విషయాల్లో రజనీకాంత్ సైలెంట్‌గా ఉన్నందుకు ఆయనపై నెగెటివిటీ స్ప్రెడ్ చేశారని విమర్శించారు. చివరకు తలైవా మైక్ ముందుకు వచ్చి... తనకు విజయ్‌పై ఎలాంటి కుళ్లు లేదని క్లారిటీ ఇచ్చుకోవాల్సి రావడం చాలా బాధాకరమన్నారు. భారతీయ సినీ రంగంలో రజనీకాంత్ సాధించిన విజయాలు, ఆయన ఇమేజ్ వేరే లెవెల్ అని విష్ణు చెప్పారు. అలాంటి గొప్ప వ్యక్తికి ఇంకొకరిపై అసూయ ఉందనడం సరి కాదని అన్నారు. సినిమా రంగంలో ఉండే మౌనాన్ని వ్యక్తిగత శత్రుత్వంగా మార్చి చూడొద్దని సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లకు విజ్ఞప్తి చేశారు.

# బడ్జెట్‌లో 40 శాతం హీరోకే పోతోంది



**హీరోల పారితోషికాలపై సంచలన విషయాలను వెల్లడించిన దిల్ రాజు**
**రెమ్యునరేషన్ తగ్గించుకోవడానికి టాలీవుడ్ హీరోలు ఇష్టపడరని వెల్లడి**
**రూ. 300 కోట్ల బడ్జెట్‌లో రూ. 120 కోట్ల వరకు హీరోకే వెళుతుందన్న దిల్ రాజు**

హీరోల పారితోషికాలు ఆకాశాన్ని తాకుతుండటంతో సినిమా బడ్జెట్లు కంట్రోల్ తప్పిపోతున్నాయనే చర్చ ఎప్పటి నుంచో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇదే విషయంపై ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ... వాస్తవాలను వెల్లడించారు. సినిమా మార్కెట్ ఈక్వేషన్స్ ఏంటో తాను హీరోలకు ముందే క్లియర్‌గా చెబుతానని, తన బడ్జెట్ పరిధికి సెట్ అయ్యే హీరోలతోనే సినిమాలు చేస్తానని ఆయన స్పష్టం చేశారు. అయితే,టాలీవుడ్ అగ్ర హీరోలు తమ రెమ్యునరేషన్ తగ్గించుకోవడానికి అస్సలు ఇష్టపడరని... దానికి కారణం పారితోషికం తగ్గితే మార్కెట్‌లో తమ 'ఇమేజ్' పడిపోతుందనే భయమేనని దిల్ రాజు చెప్పారు. ఒక వేళ రూ. 300 కోట్ల బడ్జెట్‌తో సినిమా తీస్తే... అందులో దాదాపు 35 శాతం నుండి 40 శాతం వరకు (అంటే రూ. 100 కోట్ల నుండి 120 కోట్లు) కేవలం ఒక్క హీరో రెమ్యునరేషన్‌కే వెళ్ళిపోతుందని షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. టాలీవుడ్ బడ్జెట్ సమస్యకు చెక్ పెట్టాలంటే హిందీ చిత్రసీమ ఫాలో అవుతున్న సరికొత్త బిజినెస్ స్ట్రాటజీని అనుసరించాలని దిల్ రాజు చెప్పారు. బాలీవుడ్‌లో ఇప్పుడు స్టార్ హీరోలు ముందే వందల కోట్లు డిమాండ్ చేయకుండా... సినిమా లాభాల్లో వాటా తీసుకునే 'ప్రాఫిట్ షేరింగ్ మోడల్'కు షిఫ్ట్ అయ్యారన్నారు. దీనికి బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ ను బెస్ట్ ఉదాహరణగా చెప్పారు. ఒకప్పుడు అక్షయ్ ఒక్కో సినిమాకు రూ. 130 కోట్ల వరకు ఫిక్స్‌డ్ రెమ్యునరేషన్ తీసుకునేవారని, కానీ ప్రస్తుత మార్కెట్ ఒడిదుడుకుల వల్ల ఆయన కూడా లాభాల్లో వాటా తీసుకునే విధానాన్నే ఎంచుకున్నారని తెలిపారు.




# 'బ్లాస్ట్' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ

కోలీవుడ్ నుంచి ఒక యాక్షన్ థ్రిల్లర్ ఇటీవల థియేటర్లకు వచ్చింది. అర్జున్ .. అభిరామి .. ప్రీతి ముకుందన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఆ సినిమా పేరే 'బ్లాస్ట్'. ఏజీఎస్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాకి సుభాష్ కె రాజ్ దర్శకత్వం వహించాడు. తెలుగులో ఈ సినిమాకి పెద్దగా పబ్లిసిటీ లేకపోవడం వలన, ఆశించిన స్థాయి రెస్పాన్స్ కనిపించలేదు. అయితే తమిళనాట మాత్రం ఈ సినిమా మంచి వసూళ్లను రాబట్టింది. 18 కోట్లతో నిర్మితమైన ఈ సినిమా, ప్రపంచవ్యాప్తంగా 70 కోట్లకి పైగా వసూళ్లను సాధించింది. అలాంటి ఈ సినిమా 5 భాషల్లో ఈ నెల 25 నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. రాజారామ్ (అర్జున్) అతని భార్య నీలవేణి (అభిరామి) కూతురు 'నీల' (ప్రీతీ ముకుందన్) తమ్ముడు ఈశ్వర్ ( వివేక్ ప్రసన్న) కలిసి నివసిస్తూ ఉంటారు. రాజారామ్ అతని భార్య ఇద్దరూ కూడా మార్షల్ ఆర్ట్స్ కుటుంబాల నుంచి వచ్చినవారే. ఇద్దరికీ మార్షల్ ఆర్ట్స్ లో మంచి ప్రవేశం ఉంటుంది. అందువలన తమ కూతురు 'నీల'కి కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తారు. అవమానం .. అన్యాయం జరిగినప్పుడు ఎలా రియాక్ట్ కావాలనేది తండ్రి నుంచి 'నీల' నేర్చుకుంటుంది. రాజారామ్ చిన్న పిల్లలకు కరాటేలో శిక్షణ ఇస్తుంటాడు. ఆయన భార్య మిషన్ కుడుతుంటుంది. 'నీల' ఒక వైపున జాబ్ చేస్తూనే .. మరో వైపున మెడికల్ షాప్ లో బాబాయ్ కి సాయం చేస్తుంటుంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449